గ్రామాల అభివృద్ధికి పట్టు!

- పట్టు పరిశ్రమ ఆ గ్రామాలకు వరం
- ప్రతి నెలా ఆదాయమే..
- నియోజకవర్గంలో 3 వేల ఎకరాల్లో మల్బరీ సాగు

పెనుకొండ: పట్టు పరిశ్రమ ఆ గ్రామాలకు నిత్య ఆదాయ వనరుగా మారింది. పట్టు సాగు ఉన్నంత వరకు తాము ఎలాంటి ఆర్థిక ఇబ్బందులకు లోను కామని ఆ రైతులు చెబుతున్నారు. వివరాల్లోకెళితే.. పెనుకొండ మండలం కొండాపురం, కోనాపురం, మంగాపురం, మహదేవపల్లి, రొద్దం మండలం బీదానిపల్లి, తురకలాపట్నం, కోగిర, కంబాలపల్లి, సోమందేపల్లి మండలం చాలకూరు, చల్లాపల్లి, కదిరేపల్లి, ఓబుళదేవరపల్లి తదితర గ్రామాల్లో పట్టు సాగు పెద్దఎత్తున కొనసాగుతోంది. ప్రతి 25 రోజులకు ఒక పంటను తమ చేతికి అందిపుచ్చుకుంటున్న రైతన్నలు ఆర్థిక ప్రగతిని సాధిస్తున్నారు. పెనుకొండ మండలంలో 600 ఎకరాలు, రొద్దం 1200, గోరంట్ల 100, పరిగి 1200 ఎకరాలు, సోమందేపల్లి 950 మేర మల్బరీ తోటలు సాగుచేస్తున్నారు.

కర్ణాటక నుంచి మట్టి కొనుగోలు..

పట్టు రైతులు ప్రతి 25 రోజులకోసారి మట్టిని(రేషం) పురుగులను కర్ణాటక ప్రాంతం నుంచి కొనుగోలు చేస్తున్నారు. రెండు జ్వరాలు పోయిన పురుగులను నేరుగా అందజేస్తున్న పట్టు సిబ్బంది వంద మట్టిని రూ. 5,800 ధరలో రైతన్నకు అందిస్తున్నారు. వంద మట్టి అంటే రేషం గుడ్లు వంద కేజీలతో సమానం అని రైతులు చెబుతున్నారు. చిక్‌బళాపురం, రాంనగర్, పావగడ,


పెనుకొండ ప్రాంతంలో సాగైన మల్బరీ తోట

దొడ్డబళాపురం, శిడ్లగట్ట, గౌరిబిదనూర్, తదితర ప్రాంతాల నుంచి రైతులకు పురుగులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో 21 రోజుల పాటు రైతులు కష్టపడితే పంట చేతికి అందుతోంది. ప్రస్తుతం శిడ్లఘట్ట, ధర్మవరం, రాంనగర్, హిందూపురం మార్కెట్లలో పట్టు గూళ్లు(సీబీ) కేజీ రూ. 450 నుంచి రూ. 525 వరకు ధర పలుకుతున్నట్లు రైతులు, పట్టు పరిశ్రమ అధికారి లక్ష్మి రెడ్డి పేర్కొంటున్నారు. అదే విధంగా రైతులను ప్రోత్సహిస్తూ పుల్లలు నాటే దశ నుంచి షెడ్లను నిర్మించే స్థితి వరకు ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం ఇస్తోందన్నారు.


రైతులు ప్రభుత్వ ప్రోత్సాహంతో నిర్మించుకున్న రేషం షెడ్లు

వేసవి దాటడంతో రైతులకు ఊరట..

ప్రస్తుతం వేసవి సీజన్ ముగియడంతో పట్టు రైతులు ఊపిరి పీల్చుకున్నారు. రైతులు పంట సాగుకు కూలర్లు, గోనె సంచులు వాడుతూ ఎంతో సున్నితంగా ఉండే రేషం పురుగులను కాపాడుకోవడానికి నానా ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం వేసవి సీజన్ ముగియడంతో మల్బరీ సాగును పెంచడమే కాక, పట్టు పురుగులను షెడ్లలో మేపడానికి సంతోషంగా ముందుకు వస్తున్నారు. నేడు బోర్లలో ఎక్కడ చూసినా నీరు పెద్దయెత్తున లభ్యం కావడంతో రైతులు పంట సాగుకు ఉత్సాహం చూపుతున్నారు.

ఆదాయం బాగుంది



క్రమం తప్పకుండా పంట తీస్తున్నా. ప్రతి నెలా తప్పకుండా మంచి ఆదాయం లభిస్తుంది. మార్కెట్లో మంచి ధరలున్నాయి. ప్రభుత్వం పట్టు పరిశ్రమకు మంచి ప్రోత్సాహం కల్పిస్తోంది. ప్రతి నెలా పంటను చేతికి తీసుకుని ఆర్థికంగా లబ్ధి పొందుతున్నాను. నాగేష్, మహదేవపల్లి, పెనుకొండ నగర పంచాయతీ

రైతన్నలకు వరం



పట్టు సాగు రైతన్నలకు ఓ వరం. పెనుకొండ ప్రాంతంలో అనేక మంది రైతులు క్రమం తప్పకుండా పట్టు సాగు చేసి ఎంతో లబ్ధిపొందుతున్నారు. గతంలో మాదిరి కాకుండా పట్టు పురుగులను పెంచడం, గూళ్ల స్థితికి తీసుకురావడం ఇప్పుడు ఎంతో సులువు.

శ్రీనివాసులు, కోనాపురం, పెనుకొండ నగర పంచాయతీ

టీబీ నివారణకు బీసీజీ వ్యాక్సినేషన్


అలుడిలో వ్యాక్సినేషన్ వేస్తున్న దృశ్యం


గుడిబండలో టీకా వేస్తున్న దృశ్యం

అగళి: టీబీ (క్షయ) నియంత్రణ చర్యల్లో భాగంగా వైద్యులు శివనంద, గాయత్రి ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ కార్యక్రమం మండల వ్యాప్తంగా నిర్వహించారు.ఈ సందర్భంగా 18 ఏళ్లు దాటిన, ఐదేళ్ల కిందట మందులు వాడి టీబీ వాధి తగ్గిన వారికి, మధుమేహ వ్యాధిగ్రస్తులు, ధూమపానం అలవాటు ఉన్న వారు, 60 ఏళ్లు పైబడిన వారికి ఈ టీకాను వేస్తున్నట్లు వైద్యులు తెలిపారు. అందులో భాగంగా మండల వ్యాప్తంగా 490 మందికి బీసీజీ టీకా వేశామన్నాశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎస్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల వ్యాప్తంగా ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలోని వివిధ గ్రామాల్లో 40 ఏళ్లు పైబడి 60 ఏళ్లలోపు వయస్సున్న వృద్ధులకు క్షయవ్యాధి నివారణ కోసం వైద్య సిబ్బంది గురువారం టీకాలు వేశారు. డాక్టర్ సౌందర్య, ఏఎన్ఎం జ్యోతి ఎంఎల్‌హెచ్‌పీ గాయత్రి తదితరులు మాట్లాడుతూ టీకాలు వేయడం వల్ల శరీరంలోని రోగనిరోధకశక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉందన్నారు. క్షయవ్యాధితో పాటు మధుమేహం, బీపీ ఇతరాత్ర రోగాలు అదుపులో ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పరిగిలో బీసీజీ టీకా వేస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన

పరిగి: సమాజంలో పొగాకు ఉత్పత్తుల వినియోగంతో పాటూ మత్తు పదార్థాలకు యువత ఎక్కువగా అలవాటు పడుతున్నారని, ఫలితంగా ప్రాణాపాయం జరుగుతుందని మెడికల్ ఆఫీసర్లు స్వరూపరెడ్డి, నవీన తెలిపారు. మండలంలో గురువారం బీసీజీ టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పరిగిలో మెడికల్ ఆఫీసర్లు మాట్లాడుతూ క్షయ సాధారణంగా పొగాకు ఉత్పత్తుల వాడకంతో వస్తుందన్నారు. దీని వల్ల కుటుంబానికే ప్రమాదకరంగా మారుతుందన్నారు. వ్యాధి నియంత్రణకు ప్రత్యేక వైద్య చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పలువురికి వ్యాధి నివారణకు బీసీజీ టీకాలను వేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై వైద్య సిబ్బంది ర్యాలీ

గోరంట్ల: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరోగ్య సిబ్బంది గురువారం డెంగీ నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి స్థానిక బస్టాండ్ సర్కిల్ వరకు డాక్టర్ శృతి ఆధ్వర్యంలో ర్యాలీ సాగింది. ఈసందర్భంగా డాక్టర్ శృతి మాట్లాడుతూ దోమ కాటుతో డెంగీ వస్తుందని, నివారణ కోసం దోమతెరలు వాడాలన్నారు. అలాగే శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ వాసు, ఆరోగ్య విస్తరణ అధికారి రమణ, పీఎచ్ఎన్ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు సువర్ణదేవి, రసూల్, ఆరోగ్య, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


గోరంట్ల ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఆరోగ్యంపై వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి

రొద్దం: వృద్ధులు తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి అన్నారు. గురువారం పెద్దమంతూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. వృద్ధులకు బీసీజీ వాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన ప్రతి వృద్ధుడు వాక్సిన్ తీసుకోవాలన్నారు. చక్కర వ్యాధిగ్రస్తులు, ఇంతకు ముందు టీబీ సోకిన వారు, వారి కుటుంబ సభ్యులు, ధూమపానం చేసేవారు, బాడీ మాస్ ఇండెక్స్ 18 కన్నా తక్కువగా ఉన్న వారు బీసీజీ టీకా తప్పనసరిగా తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు రమ్య, ప్రవీణ్ కుమార్, ఎంపీహెచ్ఈఓ సుదర్శన్‌బాబు, ఎంపీఎల్‌హెచ్ ప్రమీళ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


పెద్దమంతూరులో వయోవృద్ధులకు వ్యాక్సిన్ ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ మంజువాణి

ఆలయ పునర్‌నిర్మాణానికి విరాళం

హిందూపురం: హిందూపురం సమీపంలోని సూగురు సడ్లపల్లిలో పురాతన ఆంజనేయ స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా మూలింటి కొండారెడ్డి వారి కుటుంబ సభ్యులు రూ.1,00,999 విరాళంగా అందించినట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఆర్థిక సహాయం అందించిన దాత కుటుంబ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, బాలకష్ణ రెడ్డి, బాలాజీతో పాటు ఆలయ కమిటీ సభ్యులు శివారెడ్డి, గోవిందరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ముగిసిన వేసవి శిక్షణ

హిందూపురం టౌన్: గోళ్లాపురం గ్రామంలో సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిబిరంలో విద్యార్థులకు నృత్యం, పెయింటింగ్ పోటీలు, మట్టితో పాత్రల తయారీ, జంక్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మొదలైన నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. శిబిరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. సూర్యఫౌండేషన్ ద్వారా కంప్యూటర్ శిక్షణ కేంద్రం, కుట్టు శిక్షణ కేంద్రం, సూర్య యూత్ క్లబ్, సూర్య సంస్కార కేంద్రాల్లో అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. ఏప్రిల్ 1 నుంచి మే 31 వరకు తూమకుంట చెక్‌పోస్టు, రామచంద్రాపురం, చౌళూరు, గొల్లాపురం, గుడ్డంపల్లి తదితర గ్రామాల్లో 6 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపు పిల్లలకు 10 రోజుల పాటు ఉచిత వేసవి శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో గ్రామం సర్పంచ్ దేవరాజు, ఎంపీటీసీ రామాంజి, సూర్య రోష్ని లిమిటెడ్ మానవ సంక్షేమ శాఖ అభిషేక్ కుమార్, సూర్య ఫౌండేషన్ గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్రశంసాపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పశువులకు వడదెబ్బ ముప్పే

- పాల దిగుబడిపై ప్రభావం
- మృత్యువాత పడే ప్రమాదం
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు


పశువులకు వైద్యం చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

బత్తలపల్లి: నోరులేని పశువులు అనారోగ్యం సంభవిస్తే అవి నోరు తెరిచి మనకి చెప్పలేవు. పశుపోషకులే వాటిని గుర్తించి ప్రథమ చికిత్స అందించాలి. అజాగ్రత్త వహిస్తే పాడినే నమ్ముకుని జీవించే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వేసవిలో పశువులు వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే పశువులు వడదెబ్బకు గురికాకుండా కాపాడుకోవచ్చునని బత్తలపల్లి మండల పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి సూచించారు.

శరీర ప్రక్రియ మందగిస్తుంది..

వేసవిలో పశువుల శరీర ఉష్ణోగ్రత కంటే బయటి ఉష్ణోగ్రత అధికమైనప్పుడు మెదడులోని హైపోథాలమస్ స్వేద గ్రంథుల నిర్వహణపై పర్యవేక్షణ కోల్పోతాయి. చెమటద్వారా శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. తద్వారా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడీ వేగం పెరుగుతాయి. మూత్రపిండాలు సరిగా పని చేయకపోవడంతో మూత్ర విసర్జన కుంటుపడుతుంది. దీంతో పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి శ్వాస ఆడక మరణించే ప్రమాదం ఉంది.

లక్షణాలు ఇలా..

వడదెబ్బ తగిలిన పశువుల శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల హీట్ కంటే ఎక్కువగా ఉంటుంది. చర్మం సున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. నోటి వెంట సొంగ కారుతుంది. నీడ కోసం చెట్టు కింద చేరి కూలబడుతాయి. శ్వాస పీల్చడం కష్టమవుతుంది. పశువులు క్రమంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణిస్తాయి. వడదెబ్బ ప్రభావంతో చూడి పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుంది. వడదెబ్బ వల్ల దూడల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. దూడలకు అతిసారం వ్యాధి వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు ఇలా..

వేసవిలో ఎండలోకి పశువులను వదలకూడదు. ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్నప్పుడు మాత్రమే పశువులను బయటకు పంపాలి. పశువులను రోజుకు మూడు, నాలుగు సార్లు చల్లటి నీటితో కడగాలి. నాటు జాతి పశువుల కంటే సంకరజాతి ఆవులు, గేదెలు త్వరగా వడదెబ్బకు గురవుతాయి. వాటిపై తరుచుగా చల్లటి నీళ్లను చల్లుతుండాలి. గాలి బాగా ప్రసవించేటట్లు ఎత్తైన పశువుల కొట్టాలను గడ్డితో నిర్మించాలి. రేకుల కప్పులు ఉన్న పశువుల షెడ్లపై గడ్డిని కప్పి మధ్యాహ్న వేళల్లో నీళ్లను చల్లుతుండాలి. వడగాల్పుల ప్రభావం పడకుండా గోనెసంచి పరదాలను ఏర్పాటు చేసుకోవాలి.

చికిత్స విధానం ఇలా..

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రదేశానికి మార్చాలి. పశువుల శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరుకోవడానికి పలుమార్లు చల్లటి నీటితో కడగాలి. నీటిని అందుబాటులో ఉంచాలి. వెంటనే సమీపంలోని పశువైద్యాధికారులను సంప్రదించాలి. వేడిని తగ్గించే ఇంజెక్షన్ వేయాలి. రక్తంలో డెక్ట్రోజ్‌సైలెన్ ఎక్కించడం వల్ల శరీరానికి సరిపడా గ్లూకోజ్, ఎలక్ట్రోలైట్స్ అంది పశువులు నీరసం నుంచి బయటపడుతాయి.

క్లుప్తంగా

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి


మణూరు వద్ద పనులను పరిశీలిస్తున్న ఏపీఓ శ్రీకాంత్‌గౌడు

మడకశిరరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ శ్రీకాంత్‌గౌడు సూచించారు. ఆయన గురువారం మణూరు పంచాయతీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులను కూలీలు ఎక్కువ సంఖ్యలో ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పావగడ: మొరార్జీ దేశాయి, అటల్ బిహారీ వాజపేయి విజ్ఞాన పీయూసీ వసతి కళాశాలలలో ప్రథమ పీయూసీ విజ్ఞాన విభాగం పీసీఎంబీ, పీసీఎంసీ కోర్సులకు దరఖాస్తులు అందించాలని స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ అధికారి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఈ నెల 15 నుంచి 23లోగా దరఖాస్తు చేసుకోవాన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న మొరార్జీ దేశాయి, అటల్ బిహారీ వాజ్‌పేయి, అంబేడ్కర్, , కిత్తూరు రాణి చెన్నమ్మ, ఇందిరాగాంధి వసతి పాఠశాలలు, కళాశాలలో దరఖాస్తులు తీసుకుని అవసరమైన ధ్రువీకణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ తదితర వసతి పాఠశాలలు, కళాశాలలలో సంప్రదించాలన్నారు.

రేపు వాసవాంబ జయంతి ఉత్సవాలు


అమరాపురం: మండల కేంద్రంలో వాసవాంబ జయంతి ఉత్సవాలను శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి వివిధ రకాల హోమాలు, అభిషేకాలు తదితర పూజలు నిర్వహిస్తారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు


దెబ్బతిన్న లారీ ముందు భాగం

పెనుకొండ రూరల్: హరిపురం వై జంక్షన్ సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. తమిళనాడు నుండి తాడిపత్రికి టెంకాయి పీచుతో వెళ్తున్న లారీని హరిపురం వై జంక్షన్ వద్ద బెంగళూరు నుంచి ఉత్తరప్రదేశ్‌కు వెళ్తున్న మరో లారీ వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదానికి కారణమైన లారీ ముందు భాగం పాక్షికంగా దెబ్బతినడంతో పాటు మంటలు వ్యాపించాయి. మంటలు ముందున్న లారీలోని టెంకాయి పీచుకు వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది సకాలంలో అక్కడికి చేరుకొని మంటలును అదుపులోకి తీసుకువచ్చారు. ఘటనలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన సోనమ్ అలీ,జూబేర్ అహ్మద్,సోను సింగ్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108 వాహనంలో పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రెండురోజుల పాటు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత

హిందూపురం: వాసవీ జయంతిని పురస్కరించుకుని రెండురోజులు ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షులు రామమోహన్, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి రవీంద్రుడు తెలిపారు. 18న ఉదయం పూజల అనంతరం 9గంటలకు వాసవీ ఆలయం వద్ద నుంచి ఆర్యవైశ్య మహిళలు, పురుషులతో పెద్ద ఎత్తున బైక్‌ర్యాలీ ఉంటుందన్నారు. సాయంత్రం వాసవీమాతను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ ఉంటుందని, అనంతరం నగరోత్సవం ఉంటుందన్నారు.గురువారం సాయంత్రం ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

గడ్డివామి దగ్ధం

రొద్దం: తురకలాపట్నం గ్రామంలో గడ్డివామి దగ్ధమైంది. వివరాలు.. రైతు బోయ తిమ్మయ్య ఊరి చివర దొడ్డిలో గడ్డివామి ఏర్పాటు చేసుకున్నాడు. గురువారం రాత్రి చెరువు పక్కన చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఆ మంటలు పశుగ్రాసానికి వ్యాపించాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ వలీబాషా సిబ్బందితో గ్రామానికి చేరుకుని మంటలు ఆర్పేందుకు యత్నించాడు. అయితే అప్పటికే గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ 50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

మడకశిరలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయం


ఈర లక్కప్ప

రొళ్ల: మడకశిర నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురడం ఖాయమని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప అన్నారు. గురువారం మండలంలోని హెచ్ఎం పల్లిలో జరిగిన ఓ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంరం మండల మాజీ కన్వీనర్ డాక్టర్ శివప్రసాద్, వైస్ ఎంపీపీ నాగరాజు, పార్టీ శ్రేణులతో కలసి గత సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల సరళిపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీ నాయకుడు చంద్రబాబు ఎన్ని మాయ మాటలు చెప్పినా ప్రజలు నమ్మలేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు క్యూలైన్లో నిలిచి మండుటెండను కూడా లెక్కచేయకుండా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఎన్నికల సమయంలో ప్రచారం చేసిన పార్టీశ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా చర్యలు

మడకశిరరూరల్: మండలంలోని ఆర్.అనంతపురం పంచాయతీలో ఉన్న గ్రామాల ప్రజలు వేసవిలో తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టామని సర్పంచ్ అంజినమ్మ గురువారం తెలిపారు. ఆర్. అనంతపురం, రేకులకుంట గ్రామాల్లో జేజేఎం నిధులతో ఇంటింటికీ కుళాయి సౌకర్యం కల్పించడానికి పైపులైన్ పనులు చేపట్టామన్నారు. పైపులైన్ పనులు పూర్తి చేసి బోరు వద్ద నుంచి కనెక్షన్ ఇచ్చి కుళాయిలకు తాగునీరు సరఫరా చేస్తామన్నారు. గ్రామాల్లో తాగునీరు, వీధి దీపాల సమస్య రాన్వీమన్నారు. ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయనుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అరుణాచల దర్శనానికి ప్రత్యేక బస్సు

లేపాక్షి: పౌర్ణమిని పురస్కరించుకొని ఈనెల 22న సాయంత్రం 5 గంటలకు హిందూపురం ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ శ్రీకాంత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న ఉదయం 4 గంటలకు అరుణాచలం చేరుకొని, గిరి ప్రదర్శన అనంతరం అరుణాచలేశ్వరుడిని దర్శించుకొని తిరిగి హిందూపురానికి ఈనెల 24న ఉదయం చేరుకుంటుందన్నారు. హిందూపురం డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నామని తెలిపారు. టికెట్ రిజర్వేషన్ కోసం సెల్: 8977885997 సంప్రదించాలని, టికెట్ ధర రానుపోనూ రూ.1320 చార్జీ నిర్ణయించినట్లు తెలిపారు.

నేటి నుంచి సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కొత్తచెరువు: మండల కేంద్రంలో ఈనెల 17 నుంచి 25 వరకు సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కేసీ మనోహర్ తెలిపారు. 17న శుక్రవారం ధ్వజారోహణం,18 శనివారం హంసవాహనం, 19న బృంగివాహనం, 20న శేషవాహనం, 21న నందివాహనము, 22న కళ్యాణోత్సవం, 23న రథోత్సవం(తేరు), 24న పార్వేటోత్సవం, 25న వసంతోత్సవం, పుష్పయాగం, ఊంజల్‌సేవ నిర్వహిస్తున్నట్లు వివరించారు. భక్తాదులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని సంగమేశ్వరుడి కృపాకటాక్షములు పొందాలని ధర్మకర్త సూచించారు.

మండల వ్యాప్తంగా 144 సెక్షన్


దాసగౌడనపల్లిలో మాట్లాడుతున్న ఎస్ఐ వీరేష్

అగళి: మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని ఎస్ఐ వీరేష్ తెలిపారు. మండల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. గురువారం ఆయన దాసగౌడనపల్లిలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. హింసాత్మక ఘటనలకు పాల్పడిన, విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.రాజకీయ పార్టీల నాయకులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులకు సహకరించాలన్నారు.